# వైకుంఠపాళీ

రోహిణీకార్తె - మిట్టమధ్యాహ్నం నిప్పులు చెరిగి పోస్తోంది. వేడిగాలి ఈ చెవినుండి ఆ చెవికి కొడ్తోంది. ఎప్పుడూ జనసమ్మర్ధంగా ఉండే ఆ మెయిన్‌రోడ్డు కూడా ఇంచుమించు నిర్మానుష్యంగా ఉంది. చెవులకు గుడ్డలు కట్టుకుని సోడాబుడ్ల బండ్లు తోసుకుంటూ "సోడా .... నిమ్మకాయ సోడా" అంటూ అరుచుకుంటూ వస్తున్న కుర్రవాళ్ళు మాత్రం అప్పుడప్పుడు కనిపిస్తున్నారు. సకృత్తుగా వస్తున్న రిక్షాలు మాత్రమే ఆ రోడ్డుమీద చైతన్యానికి చిహ్నంగా ఉన్నాయి.

మధ్యాహ్నం 2.30 గంటలు అవుతుంది. స్ప్లిట్ అయిపోయిన తర్వాత తిగిర డ్యూటీకి ఉసూరుమంటూ సైకిలు మీద బయలుదేరాను. సోడా కుర్రవాడు ఎదురుగా వస్తున్నాడు. సైకిలు రోడ్డు ప్రక్కన ఆపి, వాడిని పిలిచి ఒక నిమ్మకాయ సోడా తీసుకున్నాను. సోడా త్రాగి తిరిగి సైకిలు ఎక్కబోతూ వుంటే, నా దృష్టిని మరొక వ్యక్తి ఆకర్షించాడు. ఎదురుగా, నడుము వంగిపోయిన ఒక ముసలితాత "వైకుంఠపాళీలు - పూజా పుస్తకాలూ" అంటూ అరుచుకుంటూ వస్తున్నాడు. అతన్ని ఎన్నాళ్ళనుంచో నేను చూస్తూనే వున్నాను. ఒక చంకలో రకరకాల పుస్తకాలను పెట్టుకుని, మరొక చేతిలో వైకుంఠపాళీ కాగితాలు పుచ్చుకుని అమ్ముకుంటూ వస్తాడు. పగలనక, రాత్రనక, ఎండనక, వాననక, చలి అనక, ఎప్పుడూ అల్లా తిరుగుతూనే వుంటాడు. ఎప్పుడు యింటికి పోతాడో, ఎక్కడి తిండి తింటాడో తెలియదు. అతని దగ్గర ఎవ్వరూ కొంటుండగా నేను ఎప్పుడూ చూడలేదు. అయినా ఆ తిరగడమేమిటో అర్థం కాదు. నడుం వంగిపోయిన ఆ శరీరంలో అంతటి ఓపిక ఎక్కడ ఉందో అసలే బోధపడదు.

ఆ తాత నెమ్మదిగా నా వైపే వస్తున్నాడు. పెరిగిపోయిన తెల్లటి గడ్డం, పండిపోయిన చింపిరిజుట్టూ, కుళ్ళు బట్టలతో, అడుగులు తడబడుతూ వస్తున్నాడు. కళ్ళు లోతుకుపోయి, ఒళ్ళు ముడతలు పడి, కదులుతున్న శవంలా ఉన్న ఆ వ్యక్తిని చూస్తుంటే, నా హృదయంలో చేయిపెట్టి కెలికి నట్లయింది. బాదతో, జాలితో హృదయం బరువెక్కింది.

అతను దగ్గరకు రాగానే "తాతా వైకుంఠపాళీ ఎంత?" అని అడిగాడు.

"పావలా బాబూ" అన్నాడు.

"ఒకటివ్వు" అంటూ రూపాయినోటు తీసి ఇచ్చాను.

"చిల్లరలేదు బాబూ" అన్నాడు తాత నోటు చూసి. జేబులో చూస్తే మూడు పదిపైసల నాణాలు ఉన్నాయి. అవి తీసి ఇచ్చాను. తాత అవి చూసి "నా దగ్గర బొత్తిగా చిల్లర లేదు బాబూ ఇవాళ మీదే బోణీ" అన్నాడు. ఒక పదిపైసలు బిళ్ళ తిరిగి ఇచ్చేయబోతూ. "పోనీలే తాతా. మిగిలిన ఐదుపైసలూ నీ దగ్గరే ఉంచుకో, మరోసారి ఇద్దువుగానిలే, నా దగ్గర వేరే చిల్లర లేదు" అన్నాను

ఏవిధంగానైనా అతనికి అమ్మకం కల్పించాలని.

"వద్దులేబాబూ : చిల్లర ఉన్నప్పుడే కొందువుగాని" అంటూ మిగిలిన రెండు పదిపైసల నాణాలూ నాచేతిలో పడేసి వెళ్ళిపోసాగాడు తాత. నాకేమనాలో తోచలేదు. అప్పటికే తాత రెండడుగులు వేశాడు. తాతా పోనీ ఆ చిల్లర ఉంచేసుకో. పెద్దవాడివి నీకిస్తే తప్పేమిటి? అన్నాను. "నీ పైసలు నాకెందుకు ..... వద్దులే బాబూ ... నా సొమ్మే నాది కాదు" అంటూ వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు సాగిపోయాడు నెమ్మదిగా తాత. నేను ఆశ్చర్యంతో అటే చూస్తుండిపోయాను. "ఎవ్వరీ విచిత్ర వ్యక్తి?' ' ఎండనక, వాననక, అమ్మకం కోసం, ఈ తిరగడం ఎందుకు? రాక రాక ఒక బేరం వస్తే చేతులారా పోగొట్టుకోవడం ఎందుకు? ఏ వ్యాపారి అయినా ఓపైస ఎక్కువ వస్తుందంటే సంతోషంగా ఎగిరి ఎదురు వెళ్తాడు. అయాచితంగా ఐదుపైసలు వస్తుంటే వద్దని వెళ్ళిపోయాడేమిటి ఈ తాత? అది నిజాయితీయా .... తలబిరుసుతనమా .... లేక మతిలేక పోవడమా?" పరిపరి విధాల పోతున్న ఆలోచనలలో తిరిగి సైకిలెక్కి ఆఫీసుకి వెళ్ళాను.

మర్నాడు తాత దగ్గర వైకుంఠపాళీ కొనాలనే ఉద్దేశంతో ఒక పావలా ప్రత్యేకంగా జేబులో వేసుకున్నాను. అనుకున్నట్టే తాత కనిపించాడు. పిలిచి ఒక వైకుంఠపాళి కొన్నాను. నేనిచ్చిన పావలిని నిర్లక్ష్యంగా జేబులో వేసుకుని ముందుకు సాగిపోయాడు. "ఈ మనిసికి డబ్బంటే ఇంత నిర్లక్ష్యం ఏమిటబ్బా అనిపించింది నాకు. నిన్న తనలో తాను గొణుక్కున్న "సొ సొమ్మే నాదికాదు" అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి. బహుశా ఈ ముసలితాత గుండె ఏదో పెద్ద బండరాయి వంటి బాధతో నిండి ఉంటుంది. జీవితంలో ఏదో గట్టి దెబ్బలు తిని ఉంటాడు. అందుకనే అయ్యుంటుంది ఈ నిర్లక్ష్యం" అనుకున్నాను.

సైకలు తొక్కుతున్నా నా ఆలోచనలన్నీ తాత చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి. అతన్ని అర్థం చేసుకుని అతని మనసులో బాధ ఏమిటో తెలుసుకోవాలని వాంఛ ప్రగాఢం కాసాగింది నాలో.

ఆ రోజునుంచీ తాత అంటే ఆకు ఒకవిధమైన సానుభూతి ఏర్పడ్డాయి. కావాలని తరచుగా అతని దగ్గర పుస్తకాలు కొంటూ అతన్ని గురించి ఆ ప్రశ్నలూ ఈ ప్రశ్నలూ అడుగుతూండడం మొదలు పెట్టాను. బహుశా తాత దగ్గర కొనేవాడిని నేనొక్కడినే నేమో. అతనుకూడా నేనంటే ఎంతో అభిమానం చూపించడం మొదలుపెట్టాడు. మాటల వరుసలో అతని పేరు రామశర్మ అనీ, ఒకప్పుడు బాగా బ్రతికినవాడని తెలుసుకున్నాను. కాని యెంత ప్రయత్నించినా, ఎన్ని విధాలుగా అడిగినా తనని గురించి మరే వివరాలూ అతను బయటపెట్టలేదు. అన్నిటికీ ఒకటే జవాబు. "అవన్నీ ఇప్పుడెందుకులే బాబూ. ఈ పాపిష్టి జీవితం ఇలా వెళ్ళిపోతే చాలు" అంటూ సంభాషణని దాటవేసేవాడు. అతనికి ఇష్టంలేని విషయాలు చెప్పించి, మనస్సు నొప్పించడం ఇష్టంలేక ఆ ప్రసక్తి తీసుకురావడం మానివేశాను నేను. కాని ఒక్కటిమాత్రం నిజం ఆ తాత గుండెల్లో గూడుకట్టిన భయంకర రహస్యం ఏదో ఉంది. అది ఆయన మనస్సులో హోమగుండంలోని నిత్యాగ్నిలాగ రగుల్తూనే ఉంది.

ఒక ఆదివారం సాయంత్రం నేను షికారుగా ఫ్రెంచిపేట వైపు బయలుదేరాను. జండా స్తంభం దగ్గర అనుకోకుండా తాత కనిపించాడు. చేతిలో అమ్మేవి ఏవీలేవు.

"ఏమిటి తాతా ఇక్కడున్నావు?" అన్నాను నేను ఆశ్చర్యంగా.

"అవును బాబూ ..... మా ఇల్లు ఈ దగ్గరల్లోనే. కాస్త చిల్లరకొట్టు దగ్గర పనివుంటే వచ్చి చూసుకుని, ఇంటికి తిరిగి వెళ్తున్నాను" అన్నాడు తాత.

"అలాగా మరి నీ ఇల్లు నాకు చూపించవూ?" అని అడిగాను చనువుగా.

"అంతకన్నానా ..... రా బాబూ ..... ఇప్పుడే వెళ్దాం, అయినా అది ఇల్లేమిటి బాబూ ఈ ముసలిఘటానికి నీడ ఇచ్చే గూడుకాని" అన్నాడు.

"ఏదైతే నేమిలే వస్తాను పద" అంటూ ముందుకు సాగాను.

ఒక ఫర్లాంగు దూరంలో చుట్టూ పెద్ద కాంపౌండ్ ఉన్న ఒక పెద్ద ఇంటి దగ్గరకు తీసుకెళ్ళాడు తాత.

"అబ్బా .... తాత ఇంతపెద్ద ఇంట్లో ఉంటున్నాడా! చాలా ఆశ్చర్యంగా ఉందే అనుకుంటూ తాతా ..... ఇదా మీ యిల్లు? అన్నాను ఆశ్చర్యంగా. తాత నవ్వుతూ ..... "ఇదనుకున్నావా బాబూ .... అయినా నా ఇల్లూ ఈ కాంపౌండ్‌లోనే ఉందిలే. అంటూ కాపౌండ్‌కు దూరంగా ఉన్న ఔట్‌హౌస్ వైపుకు నడవ సాగాడు. మౌనంగా అతన్ని వెంబడిచాను నేను.

అది ఇల్లంటే ఇల్లుకాదు. ఒక చిన్న పెంకుటి గది. మీద ఉన్న కన్నాలలోనుంచి ఆకాశం తెల్లగా కనిపిస్తోంది. గోడలు, చూరులు దుమ్ముకొట్టుకుపోయి, బూజు వ్రేళ్ళాడుతోంది. నేలంతా దుమ్ము దుమ్ముగా, చిరిగిపోయిన కాగితం ముక్కలతో ఉంది. జీర్ణావస్థలో ఉన్న ఆ గది శుచీ శుభ్రంలేని ఆ లోపలితీరు తాత స్థితికి ఎంతైనా తగి ఉంది.

ఆ గదిలో నన్ను ఆకర్షించిందీ ఆశ్చర్యపరిచిండీ ఒక్కటే ఒకటి ఉంది. ఆ గదిలో తలుపులు లేని గూడులో తెలుగు, ఇంగ్లీషు భాషలలో అనేక పుస్తకాలు ఉన్నాయి. అది ఏమిటోనని దగ్గరకుపోయి చూశాను. అవన్నీ భారత, భాగత, రామాయణం వంటి మహాకావ్యాలూ, పురాణాలూ, వేదాంత గ్రంథాలూనూ. అవి అమ్మకంకోసం పెట్టుకున్న పుస్తకాలేమోనని ముందు అనుకున్నాను. కాని వాటి ఆకారం చూస్తే అల్లా కనిపించలేదు. అట్టఎత్తి మొదటి పేజీ చూసేసరికి ముత్యాల వంటి అక్షరాలతో "కె. రామశర్మ" అని ఉన్న సంతకం అది కొన్న తేదీలు కనిపించాయి. అవన్నీ చూస్తుంటే నా ఆశ్చర్యానికి అవధి లేకుండా పోయింది. వాటిని చూస్తూ ఆశ్చర్యంగా అల్లాగే నుంచుండిపోయాను.

"ఏమిటి బాబూ చూస్తున్నావు?" అంటూ తాత పలకరించిన పిలుపుతో తిరిగి ఈలోకంలోకి వచ్చాను. "తాతా ఇవన్నీ నీ పుస్తకాలేనా?" అని అడిగాను.

"అవును బాబూ .... ఇంకా ఎన్నో ఉండేవి. అవన్నీ అమ్మివేశాను. మనశ్శాంతికోసం ఈ కాసినీ ఉంచుకున్నాను. వయస్సుతోపాటు నా దృష్టి మాంద్యమూ పెరిగింది. చదివే ఓపికా తరిగింది. అందుకనే అవన్నీ మూలపడేసి ఉంచాను" అన్నాడు నిట్టూరిస్తూ.

"ఇవన్నీ చూస్తుంటే నీవెవరో మహాపండితుడివలె కనిపిస్తున్నావు. నీ కథేమిటో నాకు చెప్పవా తాతా?" అన్నాను ఆత్రంగా.

తాత కొద్ది క్షణాలు ఆలోచిస్తూ ఉండిపోయాడు. తల పరికిస్తూ "వద్దు ..... బాబూ ..... నా కథచెప్పి నీ మనస్సు పాడుచేయలేను ..... నీవు ఎన్నిమార్లు అడిగినా చెప్పడం లేదని ఏమీ అనుకోవద్దు" అన్నాడు. "అదికాదు తాతా. మనస్సులో బాధ మరొకరితో చెప్పుకుంటే హృదయం తేలిక పడుతుంది. ,నన్ను పరాయివాడిగా భావించకు. 'నేను నీ బాధని తీర్చలేకపోయినా ఆర్చగలను' ' అన్నాను.

"లేదు బాబూ ... ప్రస్తుతం నేను ఏమీ చెప్పలేను .... నా మనోవ్యధ తగ్గించుకోవాలని కూడా నాకు లేదు. ఎప్పుడు ఈ మొండిఘటం రాలిపోతుందా అని ఎదురు చూస్తున్నాను. అయితే ఒక్కటి మాత్రం చెబుతాను. నేనూ ఒకప్పుడు ఘనంగా బ్రతికినవాడినే. నేను చేతులారా చేసుకున్న పాప

ఫలాన్ని అనుభవిస్తున్నాను బాబూ. సమయం వచ్చినప్పుడు నా కథ నేనే చెబుతాను. నీకు కాకపోతే మరెవరికి చెబుతాను బాబూ" అన్నాడు తాత. ఆ ఎండిపోయిన లోతైన కళ్ళల్లో నీరు గిర్రున తిరిగి, ఆ లోతును భేదించుకుని బయటకు రాలేక అక్కడే ఆగిపోయింది.

ఇంక ఆ ప్రస్తావనతో తాతని బాధపెట్టదలుచుకోలేదు. నేను, సంభాషణ మార్చే ఉద్దేశ్యంతో "తాతా ..... మరి ఇక్కడ ఇంకెవరూ ఉన్నట్టు లేరే. మరి నీకు భోజనం ఎలా?" అన్నాను.

"నాకెవ్వరూ లేరు బాబూ ..... ఓపిక ఉంటే వండుకుంటాను. లేదా హోటలు ఉండనే ఉంది. అయినా ఈ పాపిష్టి పొట్ట కెంతకావాలి?" అన్నాడు.

మరికొంచెంసేపు ఆ మాట, ఈ మాటా మాట్లాడి నేను యింటికి వెళ్ళిపోయాను.

ఆరోజు నుండి తాత అంటే .... నాకున్న అభిమానంతోపాటు ఎనలేని గౌరవం ఏర్పడింది. చాలా తరచుగా అతన్ని ఇంటి దగ్గర కలుస్తుండే వాడిని. అప్పుడప్పుడు మా ఇంటికి తీసుకొస్తుండే వాడిని. ఏదో మిషమీద, అతనికి పళ్ళు ...... ఇంట్లో చేసిన పిండివంటలు ఏవైనా ఉంటే అవీ, తీసుకువెళ్ళి ఇస్తుండేవాడిని. అతనికి కూడా నేనంటే అమితమైన అభిమానం ఏర్పడింది. అయితే నేను మాత్రం ఎప్పుడూ అతని గత జీవితం గురించి, మళ్ళీ ప్రస్తావించలేదు.

నేను అవసరమైన పని ఉండి పదిహేను రోజులు సెలవుపెట్టి ఊరు వెళ్ళి వచ్చాను. నేను ఊరు వెళ్తున్నానంటే తాత చాల బాధపడ్డాడు. ఊళ్ళో లేని రోజుల్లో నాకు అతను చాలాసార్లు జ్ఞాపకానికి వచ్చాడు.

ఆరోజు నేను సెలవు నుంచి వచ్చి తిరిగి డ్యూటీలో జేరాను. ఆనాటి సాయంత్రం తాత ఇంటికి వెళ్ళాలను కున్నాను. క్రిందటి రెండు రోజుల నుండి నాకోసం ఎవరో ఫోన్ చేస్తూ వచ్చారని తెలిసింది. నన్ను ఫోన్‌లో పిలిచే వాళ్ళు చాలా అరుదు. అటువంటప్పుడు ఎవరో నన్నురెండుసార్లు పిలిచారంటే నాకు ఆశ్చర్యం కంటే ఆందోళన ఎక్కువయింది. ఎవరు ఫోను చేసినది వాళ్ళు చెప్పలేదట. మళ్ళీ ఫోన్ చేస్తాము అని చెప్పి పెట్టేశారుట.

సీట్లో కూర్చున్నా నన్నమాటే కాని, మనస్సు మనస్సులోలేదు. మనస్సు వికలమయిపోయింది. ఆందోళన అంతకంత అధికమవుతోంది. ఆలోచనలు పరిపరి విధాలు పోతున్నాయి.

ఆలోచిస్తూ అల్లానే కూర్చుండిపోయాను. ప్యూన్ వచ్చి "సార్ .... మీకు ఫోన్ వచ్చింది" అంటూ చెప్పడంతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాను.

"ఫోన్" అని వినగానే ఒక్క ఉదుటుని సీట్లోనుంచి లేచాను. దడదడ లాడుతున్న గుండెతో వడివడిగా అడుగులు వేస్తూ, ఫోన్ ఉన్న వైపు పరుగెత్తాను.

ఫోన్‌లో అవతల ఉన్నవ్యక్తి తాత ఇంటి యజమాని. తాతకి ఒంట్లో ఏమీ బాగుండడము లేదని, మంచం మీద నుంచి లేవడం లేదనీ, నన్ను చూడాలని అంటున్నాడనీ, సాధ్యమైనంత త్వరగా వీలుచూసుకుని ఒకసారి వచ్చి వెళ్ళమనీ చెప్పాడు. క్రిందటి రెండురోజులో నుంచీ ఫోన్ చేస్తూ వచ్చింది ఆయనేనట.

తాత నాకు రక్తబంధువు కాకపోయినా, ఈ వార్త నాకు ఆందోళన కలిగించింది. వెంటనే పర్మిషన్ తీసుకుని, తాత ఇంటికి బయలుదేరాను.

అక్కడికి వెళ్ళేసరికి, తాత గదిలోనించి, ఇంటి యజమాని బయటకు వస్తున్నాడు. నేను ఎదురువెళ్ళి "సార్ ఆయనకి ఎట్లా ఉంది?" అని అడిగాను ఆత్రంగా.

"ఏమీ బాగాలేదండీ ... డాక్టరును పిలిపించాను. నేను చేయగలిగినదంతా చేస్తూనే ఉన్నాను.

ప్రొద్దుటినుంచీ ఉండి ఉండి సంధిప్రలాపన కూడా వస్తోంది. అయినా ఈ వయస్సులో కష్టమే మరి. వెళ్ళి చూడండి" అంటూ వెళ్ళిపోయాడు ఆయన.

ఒక్క ఉదుటున లోపలికి వెళ్ళాను. మంచానికి అంటుకుపోయి పడుకుని ఉన్నాడు తాత. కళ్ళు మూసుకుని మూలుగుతున్నాడు.

"తాతా ... తాతా ...." అంటూ పిలుస్తూ మంచంమీదనే తలదగ్గర కూర్చున్నాను.

కళ్ళు భారంగా విప్పి చూశాడు తాత ..... ఆ చూపుతో చైతన్యం లేదు. "తాతా .... నేను ... అన్నాను మళ్ళీ."

తాత కనురెప్పలు కుంచించుకోసాగాయి. చూపుల్లో చైతన్యం రాసాగింది. కళ్ళల్లో కాంతులు వెలుగొందాయి. నీరసంగా భారంగా "వచ్చావా బాబూ" అన్నాడు.

"అవును తాతా ...... నేనే ఊళ్ళో లేనుగా .... ఇవాళ్ళే వచ్చాను. ఎల్లా ఉంది నీ వంట్లో?' ' అన్నాను. గాద్గదికంగా మాట్లాడుతుంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"సంతోషం నాయనా .... చివరి ఘడియలో నిన్ను చూడకుండానే కళ్ళు మూస్తానేమోనని భయపడ్డాను. నిన్ను చూడగానే హృదయం ఎంతో తేలిక పడింది బాబూ" అన్నాడు.

నీకేం ఫర్వాలేదులే తాతా ..... జ్వరం అదే తగ్గిపోతుంది. నేను వచ్చేశాను కదా. కావలసిన వన్నీ ఏర్పాటు చేస్తాను" అన్నాను నేను ధైర్యం చెబుతూ.

నా మాటలకు తాతకు నవ్వు వచ్చింది. ఆ నవ్వును కప్పిపుచ్చుతూ దగ్గుతెర వచ్చింది. దాంతో మనిషి విపరీతంగా అలిసిపోయి ఆయాసపడసాగాడు.

నేను తాత గుండెల మీద చేయివేసి నిమరడం మొదలు పెట్టాను.

తనను తాను సంబాళించుకుని, ఆయాస పడుతూ కొంచెం సేపు మౌనంగా ఊరుకున్నాడు తాత. నెమ్మదిగా తలగడ క్రిందకి చేయిపోయినిచ్చి మడత పెట్టి ఉన్న వైకుంఠపాళీ కాగితం ఒకటి తీశాడు. మడత విప్పి దానివంకే తదేకంగా చూడడం మొదలుపెట్టాడు. తాత కొనుకొలకుల్లో నీళ్ల నిలిచాయి. పెదిమలు బిగించుకున్నాయి. ఒక్కసారి తలపంకించి ఆ కాగితం వంకే చూస్తూ చెప్పసాగాడు.

"నాకు భయమేమిటి బాబూ .... ఈ క్షణంకోసమే ఎదురు చూస్తున్నాను. జీవితం అంటే వైకుంఠపాళీ అని నాకు తెలిసినా, అన్నీ నిచ్చెనలే, ఎక్కగలనన్నుకున్నాను కాని, పాములూ కాటు వేస్తాయనుకోలేదు. అన్నిటికన్నా పెద్ద నిచ్చెన ఎక్కబోయి, పెద్దపాము నోట్ల పడిపోయాను బాబూ. కన్న కొడుకుని చేతులారా పొట్టనపెట్టుకున్నాను. నిన్నే నా కొడుకుగా భావించుకుని నీ సమక్షంలో నా ప్రాణాలు వదలాలనుకున్నాను. భగవంతుడు కరుణామయుడు. నా ఈ చివరి కోర్కైనా కనీసం తీరుస్తున్నాడు" తాత ఇంక మాట్లాడలేకపోయాడు. దుఃఖభారంతో గొంతు మూగపోయింది. వైకుంఠపాళిని గుండెల మీద పెట్టుకుని మౌనంగా ఊరుకున్నాడు. నాలిక తడి ఆరిపోయినట్లుంది. మంచినీళ్ళు కావాలని సంజ్ఞ చేశాడు.

నేను మంచినీళ్ళు అందించాను. అవి కొంచెం తాగి తిరిగి తేరుకున్నాడు తాత. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అతి భారంగా వస్తున్నాయి.

"నీ మాటలు నా కేమీ అర్థం కావడంలేదు తాతా .... పోనీ నీకు నేను చేయగలిగిందేమైనా ఉంటే చెప్పు. అది ఎంతకష్టమైనదైనా చేస్తాను. ప్రమాణం చేసి చెబుతున్నాను" అన్నాను ఆవేశంగా.

"సంతోషం బాబూ ..... నీకు ఎన్నోసార్లు నా కథ చెప్పాలనుకొని కూడా చెప్పలేక పోయాను.

అది చెప్పే ఓపిక ఇప్పుడు లేదు. ఏనాటికైనా నీకు చెప్పాలనే ఉద్దేశంతోనే, ఒకవేళ నేను లేకపోయినా, చెప్పలేక పోయినా నీకు తెలియాలనే ఉద్దేశంతోనే. అది అంతా నీకై వ్రాసి ఉంచాను బాబూ. అటు చూడు ఆ అలమారలో పుస్తకాలపైన నా డైరీ ఉంది. అందులో నీకోసం ఒక కవరు పెట్టాను. అది యిల్లా తీసుకొని రా బాబూ" అన్నాడు అతి ప్రయాసపడుతూ.

నేను ఆ కవరు తీసుకువచ్చి తెరవబోయాను.

తాత ఆవేశంతో "బాబూ .... ఇది ఇప్పుడు తెరవద్దు. నేను చనిపోయాక చదువుకో" అన్నాడు.

ఆశ్చర్యంతో నేను కొయ్యబారిపోయాను. "అలాగేలే తాతా" అంటూ ఆ కవరును ప్యాంటు జేబులో వేసుకున్నాను.

ఆకస్మికంగా వచ్చిన ఆవేశంతో తాతకి దగ్గుతెర ముంచుకు వచ్చింది.

"తాతా .... అంటూ దగ్గరకు వెళ్ళి తల దగ్గర కూర్చుని తాత తల నా తొడమీద పెట్టుకుని గుండెలు నిమరసాగాను. దైవ నిర్ణయం మానవశక్తికి అతీతమయినట్టిది. ఆ దగ్గు నుంచి మరి తేరుకోలేక పోయాడు తాత. నా ఒడిలోనే మెడ వాల్చేశాడు. గుండెలమీద ఉన్న వైకుంఠపాళి, బిగుసుకుపోయిన తాత పిడికిలిలో నలిగిపోయింది.

తాత ఇంక లేడు. మౌనంగా అట్లాగే ఉండిపోయాను. అప్రయత్నంగా జాలువారుతున్న కన్నీటిని, ప్రయత్నపూర్వకంగా కూడా ఆపలేకపోయాను. అల్లా ఎంతసేపు ఉన్నానో నాకే తెలియదు. ప్రక్కవాళ్ళింట్లోంచి వినిపించిన గడియారం గంటలో, తిరిగి బాహ్య ప్రపంచంలోకి వచ్చాను. లేచివెళ్ళి ఈ వార్త ఇంటి ఆయనకు చెప్పాను. ఇద్దరం కలిసి శవాన్ని తీసుకువెళ్లే ఏర్పాట్లు చేశాం. శవ దహనానికి కర్తృత్వం నేను వహించాను. మరో రెండు గంటలలో రామశర్మగారి భౌతికకాయం, శ్మశానం చేరుకుంది. శవదహనానికి ముందు చేయవలసిన కర్మకాండ అంతా పురోహితుడు నాచేత చేయించాడు.

శవదహనం ప్రారంభమయింది. పురోహితుడు తరుచుగా అక్కడికి వస్తుంటాడేమో. అక్కడ ఉంటుండే వాళ్ళందరితోనూ పరిచయం ఉన్నట్లుంది. దూరంగా పోయి కూర్చుని వాళ్ళతో కబుర్లు చెప్పసాగాడు. నేను ఒంటరిగా దగ్గరలో ఉన్న తులసికోట గట్టుమీద కూర్చున్నాను. తాను చనిపోయిన తర్వాత తన కవరు తీసి చదవమన్న తాత మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. తాత వ్రాసిన లేఖతీసి చదవటం మొదలు పెట్టాను.

* * *

"పుత్ర సమానుడైన మధుబాబుని దీవించి వ్రాయునది, నీతో నాకు సన్నిహితత్వం ఏర్పడిన తర్వాత, ఎన్నోసార్లు నా గుండెలలో గూడుకట్టుకొని పేరుకుపోయిన విషాదగాథని నీతో చెప్పుకోవాలని అనుకున్నాను. కాని నా పాపిష్టి గాథ తెలుసుకుంటే నా అన్నవారు ఎవ్వరూ లేని నాకు దైవం పంపగా వచ్చిన నీవుకూడా దూరమయి పోతావేమోననే భయంతో అది చెప్పడానికి ఎప్పుడూ ధైర్యం చేయలేకపోయాను. కన్నకొడుకును చేతులారా పోగొట్టుకున్న నేను, నిన్ను నా మనస్సులో కన్నకొడుకు కన్న మిన్నగా చూసుకుంటున్నాను. ఏ కారణం చేతనైనా నీవు నా నుంచి దూరమయితే ..... ఈ ముసలి హృదయం బ్రద్దలైపోతుంది బాబూ. అయితే జీవితం మీద నాకు వాంఛ నశించలేదనీ, బ్రతకాలనే కోరిక ఉందని మాత్రం అనుకోకు. ఎండిపోయిన నా జీవితంలో నిన్ను చూసుకున్నప్పుడే, కాస్తంత ఆత్మ సంతృప్తి కలుగుతుంది బాబూ. అందుకనే చనిపోయే చివరి క్షణంలోనైనా రవ్వంత ప్రశాంతితో పోవాలనేదే నా ఏకైక వాంఛ బాబూ .... నా కథ నీకు క్లుప్తంగా చెప్తాను. నాపై నీకు

సానుభూతి కలిగితే అది నా అదృష్టంగా భావించి ఆత్మతృప్తి చెందుతంది.

"నేను చిన్నతనంలో ఎన్నో కష్టాలు పడి పేదరికం ఎంతగానో అనుభవించి, ఎన్నెన్నో అవమానాలను భరించి జీవితంలో పైకి వచ్చిన వాడిని. కన్నుయినా తెరువకముందే కన్నతండ్రిని పోగొట్టుకున్న నన్ను, పన్నెండు సంవత్సరాల వరకూ అష్టకష్టాలూపడి పెంచిన మా అమ్మ నన్ను ఈలోకానికి ఒంటరిగా అప్పగించి వెళ్ళిపోయింది. మా నాన్న దగ్గరకి. నా అన్నవాళ్ళు ఎవ్వరులేని నేను, ఒక పెద్ద ప్రెస్‌లో బైండింగ్ సెక్షన్లో కుర్రవాడిగా చేరాను. అన్నంకంటె మొట్టికాయలనూ, చెంపదెబ్బలనూ, చివాట్లను ఎక్కువగా తింటూ, బుక్ బైండింగ్‌లో ప్రావీణ్యం సంపాదించాను. ఆ తర్వాత స్వంతంగా బుక్‌బైండర్‌గా జీవితం ప్రారంభించి, నా నిర్విరామ కృషితో పైకి వచ్చి ఒక బ్రహ్మాండమైన ప్రెస్‌కి అధిపతి గానూ, దానితోపాటు అనేక రంగాలలో వ్యాపారాలు చేసి లక్షలకు లక్షలు ఆర్జించాను. నాకు అదృష్టం మీద నమ్మకంలేదు. వ్యక్తిశ్రమలో లోపం లేకుంటే మనిసి ఎంతటి ఔన్నత్యానికైనా పోగలడనే నా దృఢ విశ్వాసం. ధనప్రభావం వల్ల సంఘంలో నాకు ఏర్పడిన పరిస్థితిని రాణింపజేసుకునేందుకు స్వయంకృషితో, తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లోనూ విశేశ ప్రావీణ్యత గడించాను.

సమాజంలో నాకొక ఉన్నత స్థానం ఏర్పరచుకున్నాక నా నలభై రెండోయేట వివాహం చేసుకున్నాను. పేదరికం అంటే ఏమిటో బాగా చవిచూచిన నేను బీదరికం వల్ల ముప్పయ్యో వడిలో పడినా పెళ్ళికాని నాకు తెలిసిన ఒక ఉత్తమ యువతిని చూసి పెండ్లి చేసుకున్నాను. నా వైవాహిక జీవితం ఐదు సంవత్సరాలపాటు అవిచ్ఛిన్నంగ అమందానందంతో గడిచిపోయింది.

నా అర్థాంగి ఒక మగబిడ్డను ప్రసవించి, నాకు అప్పగించి, ఈ లోకంనించి నిష్క్రమించింది. వైద్యులకు లోటులేదు? ఔషధాలకు లోటులేదు. దేనికీ లోటులేదు. నాకు అయిన లోటల్లా నా ఇల్లాలే. అదేనా ప్రయోజక జీవితంలో మొదటి దెబ్బ. అదే నాకు మానవశక్తికి అతీతమయిన "అదృష్టం' ' అనేది ఒకటి ఉందని కనువిప్పు కలిగించింది. అందరూ అంటుండే "విధి" అంటే అదే కాబోలని అప్పుడు అర్థమయింది.

నా ప్రభాకర్‌ని - అంటే నా పసిపాపని, నా కనుపాపగా పెంచుకున్నాను. వాడికోసం నా భార్య చెరగని స్మృతికోసం నేను తిరిగి వివాహం చేసుకోలేదు. అల్లారుముద్దుగా నా బాబుని పెంచుకున్నాను.

ఏదైనా మోతాదు ఎక్కువయితే విషమిస్తుందంటారు. అది "అనుభవాలు"కి కూడా వర్తిస్తుందని, నా జీవితంలో చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. నేను పేదరికం అనుభవించిన కారణంగా, సంపదలోని సౌఖ్యం నాకు తెలుసు. నా బిడ్డకి కష్టాలు ఏమిటో, ఇబ్బందులు ఏమిటో తెలియకుండా పెంచితే, వాడు చెడిపోయి, ఆస్తినంతా పాడుచేస్తాడని భయపడ్డాను. అందుచేత వాడికి నేను ఎప్పుడూ డబ్బు ఇచ్చేవాడిని కాను. తప్పనిసరి అయితే, ఎంగిలి మెతుకులు విదిల్చినట్లు విదిలించేవాడిని. కట్టుకోడానికి మంచి బట్టలు కుట్టించేవాడిని కాదు. ఏడాదికి ఒక్క సినిమా చూపించడమంటే గగనమయి పోయేది. స్నో, పౌడరు లాంటి అలంకరణలు అసలే లేదు. వాడు ఎప్పుడైనా మారాం పెడితే, గట్టిగా కోప్పడి కొట్టినంత పని చేసేవాడిని. లోలోపల నా ప్రవర్తనకి బాధపడినా, అదంతా వాడి మంచికోసమే కదా, అని తృప్తి పడేవాడిని. రాను రాను ప్రభాకరానికి నేనంటే ప్రేమ తరిగిపోయి భయం పెరిగిపోసాగింది. ఆ విషయం నేను గమనిస్తున్నా యుక్తవయస్సు వచ్చాక, నా ప్రవర్తనని వాడే అర్థం చేసుకుంటాడు లెమ్మని సరిపెట్టుకునేవాడిని. లక్షాధికారి బిడ్డ

ఈవిధంగా ఉండడాన్ని తనతోటివాళ్ళు గేలిచేస్తున్నారని, గోల పెడ్తుండేవాడు. అయినా నేను లక్ష్యపెట్టక వాడిని కేకలేసి పంపించేవాడిని. వాడి హైస్కూలు చదువు అయ్యేవరకూ ఇల్లాగే వాడు పెరిగాడు. అన్నీ నోరు మూసుకుని భరించసాగాడు.

కాలేజీలో జేరాక ప్రభాకరం ప్రవర్తనలో మార్పు రాసాగింది. కొంచెం కొంచెం తిరగడం మొదలుపెట్టాడు. రోజులు గడుస్తున్న కొద్దీ పోట్లాడడం కూడా మొదలు పెట్టాడు. అంతకంటె గట్టిగా నేను కేకలు వేసేవాడిని. రోజులు గడుస్తున్న కొద్దీ మా ఇద్దరిమధ్యా అంతరం అంతకంతకూ తెలియకుండా పెరిగిపోసాగింది. వాడిమీద ప్రేమాభిమానాలు, నా మనస్సులో ఎంతగా ఉన్నా పైకిమాత్రం కోపం నటించే వాడిని. వాడి మనస్సులో నాపై ఎటువంటి అభిప్రాయం ఏర్పడుతోందో తెలుసుకోవాలని నాకు ఎప్పుడూ అనిపించలేదు.

ఒకరోజు అది నా జీవితంలో కల్లా దౌర్భాగ్యపు రోజు. ఆరోజు ఉదయం కాలేజీకి వెళ్ళే ముందు ప్రభాకరం నా దగ్గరకు వచ్చి తన కాలేజీలో చాలమంది నాగార్జున కొండకు పిక్నిక్ వెళ్తున్నారనీ తనని కూడా పంపమని అడిగాడు. నేను మామూలుగానే కసురుకున్నాను. చదువు సంధ్యలు మానేసి ఈ తిరుగుళ్ళేమిటని కోప్పడ్డాను.

కోపంతో వాడి ముఖం 'జేవు'రించింది. కళ్ళు ఎరుపెక్కాయి. ఒళ్ళు వణకసాగింది. ఏదో అనబోతుండగా ఎవరో వచ్చారు, నాకోసం. నేను వారితో మాట్లాడడానికి వెళ్ళిపోయాను. వాడు కాలేజీకి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం నేను ప్రెస్‌లో ఏదో బిజీగా పని చేసుకుంటున్నాను. ప్రభాకరం తన వెంట ఐదారుగురు స్నేహితులతో అక్కడకి వచ్చాడు. వాళ్ళు ప్రభాకరాన్ని పిక్నిక్‌కి పంపమనీ, పిక్నిక్‌తోపాటు వాళ్ళ చదువుకి సంబందించిన బొటానికల్ స్టడీ కూడా ఉంటుందని, అందువల్ల తప్పక పంపమనీ అడిగారు.

నేను అంతకుముందే, ఏదో వ్యవహారం విషయంలో ఎవరితోనే పోట్లాడి ఉన్నాను. ఈ వేడిమీద వాళ్ళు అడిగేసరికి, నాకు చిర్రెత్తుకొచ్చి తారాజువ్వలాగా ఎగిరాను. వాళ్ళకు సమాధానం చెప్పకుండా ప్రభాకం మీద విరుచుకు పడ్డాను. నువ్వడగ్గా పంపించనిది వాళ్ళచేత అడిగిస్తే పంపిస్తాననుకున్నావా. ఒక్కసారి చెబితే బుద్ధి ఉండక్కరలేదా" అంటూ అందరి ముందూ ముక్క చివాట్లు పెట్టాను. నా కేకలకి ప్రెస్‌లో వాళ్ళు బిత్తరపోయారు.

ప్రభాకరం స్నేహితులు నేను చూడకుండానే జారుకున్నారు. కళ్ళ వెంబడి నీళ్ళు కార్తూ, కొయ్యబొమ్మల్లే ఉండిపోయాడు, ప్రభాకరం. లోపల ఎంత బాధపడ్డాడో ఏమో తెలియదు కాని, ఆవేశం అంతా దిగమింగుకుని అతి శాంతంగా అన్నాడు. అయితే లోపల ఉడుకుతున్న రక్తపు ఛాయలు ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. "నాన్నా పూర్వజన్మలో మనిద్దరం శత్రువులమయ్యుంటాము. ఏదో శాపవశాత్తూ ఈజన్మలో తండ్రీకొడుకుల మయ్యాం. దేవుడు కల్పించిన ఈ సంబంధాల్ని నేను ఇంతటితో తెంచి వేయదలచుకున్నాను. నాకు నీవు వద్దు, నీ ఆస్తి వద్దు. నేనే కనుక నిజంగా నీ కొడుకునైతే ఈ జన్మలో మళ్ళీ నా ముఖం నీకు చూపించను. తిరిగి నీ ఇంటిలో అడుగుపెట్టను' ' అంటూ వెనుతిరిగాడు.

నా తిక్క పరాకాష్టనందుకుంది. "పోరా .... పో ..... అంతటి ప్రయోజకత్వం ఉంటే నాలాగే పైకి రారా, అప్పుడే నా కొడుకు వనిపించుకుందువుగాని" అన్నాను ఆవేశంతో.

ప్రభాకరం బయటకు వెళ్ళిపోయాడు. వాడే కనక అంతకుముందు అన్నమాటలు శాంతంగా

కాక కోపంగా అనిఉంటే వాడు వెళ్ళకుండా అడ్డుపడి ఉండేవాడినేమో. తిక్క తిరిగాక వాడే ఇంటికి వస్తాడులే అని ఊరుకున్నాను.

వాడు నా కన్నబిడ్డ అయినా వాడిని నేను సరిగ్గా అర్థం చేసుకోలేదు. కాని వాడు మాత్రం తాను నా బిడ్డ అని నిరూపించుకున్నాడు. నాకు ఉన్న పట్టుదల నూటికి నూరుపాళ్ళు వాడికీ సంక్రమించింది. వాడు మళ్ళీ ఇంటికి రాలేదు. మర్నాడు కూడా రాకపోయేసరికి ఒకవేళ చెప్పకుండానే పిక్నిక్‌కి వెళ్ళిపోయాడేమోనని వాకబు చేశాను. వాడు వెళ్ళలేదని తెలియగానే నా గుండెల్లో పిడుగు పడింది. ఏ అఘాయిత్యం చేశాడోనని నేను తల్లడిల్లి పోయాను. వెంటనే పోలీసు రిపోర్టు ఇచ్చాను. అనేకమందిని దేశం నలుమూలలా పంపి వెదికించాను. పేపర్లో ప్రకటించాను. తెలిసిన వాళ్ళందరికి ఉత్తరాలు వ్రాశాను. రోజులు గడిచిపోయినాయి. కాని, నా ప్రెస్‌లోంచి అస్తమించిన నా ప్రభాకరం తిరిగి నా ఇంట ఉదయించలేదు.

మూడు సంవత్సరాలు గడియిపోయినా నా ప్రభాకరం జాడ తెలియలేదు. అసలు ఈ లోకంలో ఉన్నాడో లేడో కూడా తెలియదు. మనశ్శాంతి కోసం తీర్థయాత్రలకు బయలుదేరాను. దేశం అంతా తిరుగుతూ చిలకలపూడి పాండురంగడి కార్తీక ఉత్సవాలు చూడడానికి, ఈ మచిలీపట్నం వచ్చాను. తిరునాళ్ళలో ఆకస్మికంగా, వైకుంఠపాళీలు, పుస్తకాలు అమ్ముతూ నా ప్రభాకరం ..... నావంటి లక్షాధికారి ఏకైక పుత్రుడు కనిపించాడు. గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు. ఆప్యాయంగా పలకరించి నన్ను తాను ఉంటున్న గదికి తీసుకుపోయాడు.

ప్రభాకరంలో చింత చచ్చినా పులుపు చావలేదు. తాను మాత్రం మళ్ళీ ఇంటికి రానన్నాడు. నా డబ్బు చిల్లిగవ్వకూడా అక్కరలేదున్నాడు. వాడు ఎన్నెన్నో కష్టాలు పడిందీ, వీధులవెంట తిరుగుతూ పుస్తకాలు అమ్ముకుంటూ యెంత నికృష్టంగా బ్రతుకుతోందీ వివరంగా గుచ్చి గుచ్చి మరీ చెప్పి నా గుండెల్ని పిండిచేశాడు. అవన్నీ సవివరంగా చెప్పి నా మనస్సుని క్షోభపెట్టి, నాపై కసి తీర్చువాలనే భావం వాడి ముఖంలో మాట మాటలో స్పష్టంగా కానవచ్చింది.

నా తప్పులు క్షమించి ఇంటికి రమ్మని నేను వాడి కాళ్ళమీద పడి చంటిపిల్లవాడిలాగా ఏడ్చాను. అయినా వాడి హృదయం కరగలేదు. నేను కూడా వాడిని ఎక్కువ బలవంతం చేయవలసిన అవసరం లేకపోయింది. యింటికి రానన్న వాడిమాటే నెగ్గించుకున్నాడు. వాడు ఇల్లువదలి అష్టకష్టాలు పడుతుండగా తనకు తానై వచ్చి సాహచర్య ఇచ్చిన క్షయవ్యాధి ఆ రాత్రి వాడిని శాశ్వతంగా నానుంచీ, ఈ లోకం నుంచీ దూరం చేసి తనలో కలిపేసుకుంది. అయిపోయింది. అంతా అయిపోయింది. గుండెలు బాదుకుని, తల మోదుకుని, ఏడ్చాను. నా చేతులారా చేసుకున్న పాపానికి, ఎవరేమి చేయగలరు? నా బిడ్డ చేతిమీదుగా దహన సంస్కారాలు పొందవలసిన నేను, నా చేతులతో వాడికి నిప్పంటించాను.

కన్నకొడుకును చంపుకున్న హంతకుడిని నేను. అయినా ఏ న్యాయస్థానం నాకు శిక్ష విధించదు. కనుక నాకు నేనే శిక్ష విధించుకోవాలనుకున్నాను. నా మూలంగా నా బిడ్డ ఎన్ని కష్టాలు పడ్డాడో అన్నిటికన్నీ, నాకై నేను కల్పించుకోవాలనుకున్నాను. ఒక్కసారి యే విషమో మ్రింగి తేలికగా ప్రాణం తీసుకోవచ్చు. కాని అల్లా అయితే నాకు శిక్ష ఏదీ? అందుకే నా కుమారుడివలే, సంవత్సరాలు తరబడి, చిత్రవధకు గురి అవుతూ, ప్రాణం పోగొట్టుకోవాలని నిశ్చయించుకున్నాను". అందుకే నా యావదాస్తీ అమ్మేసి, నా ప్రభాకరం పేరుతో దేశంలో అనేక ధర్మ సంస్థల నేర్పరచాను. నాకై చిల్లిగవ్వ కూడా ఉంచుకోలేదు. నా కొడుకు శాశ్వతంగా కన్ను మూసిన యీ మచిలీపట్నంలోనే స్థిరపడ్డాను.

వాడువుంటూ వున్న గదిలోనే స్థానం ఏర్పరచుకున్నాను. వాడు వదిలిపెట్టి వెళ్ళిపోయిన వైకుంఠపాళీలూ పుస్తకాలు నేను తీసుకుని అమ్మకం ప్రారంభించాను. జీవతపు వైకుంఠపాళీలో నిచ్చెన ఎక్కడం మానేసి పాముల చేత కరిపించుకోసాగాను. అన్నిటికన్నా పెద్ద నిచ్చెన ఎక్కి పరమపద సోపానం చేరాలనుకున్న నేను పెద్ద పామునోట్లోపడి జీవితం చాలిస్తున్నాను.

ఇంక ఆపైన జరిగిన సంగతి నేను నీకు చెప్పాల్సిన అవసరం లేదు. నా ప్రభాకరానికి, కాలేజీ చదువు అవగానే బహుకరించాలని చక్కని ఖరీదైన వాచిని కొన్నాను. వాడికి వచ్చే భార్యకోసం నా భార్య నగలలో నుంచి ఖరీదైనవి కొన్ని అట్టిపెట్టి ఉంచాను, ఇవన్నీ నా ప్రభాకరం ఫోటోతోపాటు నాపుస్తకాల వెనక ఉన్న చిన్న ఇత్తడి పెట్లో ఉన్నాయి. నా బిడ్డ గతించినా, అన్నీ అమ్ముకున్నా వీటిని మాత్రం అమ్మకోలేదు. వాటిని చూసుకుంటూ, నా భార్యపుత్రులను తలుచుకుంటూ రోజులు గడిపాను. నిన్ను నా బిడ్డలాగా చూసుకున్నాను కనుక నీకు అభ్యంతరం లేకపోతే వాటిని నీవు స్వీకరించు. నా ఆత్మ సంతోషిస్తుంది, అభ్యంతరం వుంటే వాటిని అమ్మేసి, ఆ పైకం నిరుపేదలకు నా ప్రభాకరం పేరుమీదుగా పంచిపెట్టు. ఇదే నా చివరి కోరిక.

నాకు నా అనేవాళ్ళు లేరు .... కనుక నా మరణ వార్త తెలియచేయడానికి కాని, మరెందుకు కానీ నీవు శ్రమపడనక్కరలేదు. నీ చేతుల మీదుగా ఈ కట్టెకు నిప్పంటించు, అదే నేను కోరేది.

ఇట్లు
నీ వైకుంఠపాళీ తాత....

ఉత్తరం పూర్తిచేసేసరికి కళ్ళనుండి నీరు బొట్లు, బొట్లుగా పడసాగాయి. కళ్ళు తుడుచుకుని, ఉత్తరం మడిచి చొక్కా జేబులో పెట్టుకున్నాను. మరో కాగితం మడత ఏదో చేతికి తగిలింది. ఏమిటాఅని బయటికి తీసి చూస్తే అది తాత చనిపోయేముందు చూస్తుండిన వైకుంఠపాళీ కాగితం. దాని వంక ఒక్కసారి కసిగా చూసి, దాన్ని తీసికెళ్ళి, మండుతున్న చితిలో పడేశాను. చూస్తుండగా, తాతని తనపై ఎక్కించేకోలేని పెద్ద నిచ్చెన, గుటుక్కున మింగి అధః పాతాళానికి పడతోసిన పెద్దపామూ, తాత శరీరంతోపాటు కాలిపోసాగాయి. భారంగా నిట్టూర్చి వెనుదిరిగాను.

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక 5-11-1971)*